నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

చేతకానివారు,శక్తియు కలవారు
పరిసరములనెల్ల వరుసజూడ
మారునొకరులొంగి మార్చునొకరు దాని
మనుజులిట్లునుండు మహినినేడు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 25 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 4-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




# పందెం కాస్తే నేరమే!

## ఆన్‌లైన్ గేమింగ్‌పై సుప్రీం ఆర్డర్


- రాష్ట్రాల నిషేధ చట్టాలు పూర్తిగా చెల్లుతాయి: సుప్రీంకోర్టు
- బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదు
- హైకోర్టుల తీర్పులను పక్కనబెట్టిన అత్యున్నత న్యాయస్థానం
- ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ నిర్వాహకులకు గట్టి ఎదురుదెబ్బ
- యువత ఆత్మహత్యలు, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న బెంచ్
- దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమం

న్యూఢిల్లీ,
ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుతాయని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వెల్లడించింది. బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది.

-మిగతా 2 లో

## అమెరికాలో త్రివర్ణ పతాకానికి అవమానం

- నోట్లో సిగరెట్‌తో బూతులు.. కొందరు అమెరికన్ల వత్తాసు!
- క్లేటన్ వాకర్‌గా గుర్తింపు.. వెలుగులోకి వచ్చిన విద్వేష ఉదంతం
- ఇండియన్ల జనాభా పెరుగుదలపై అక్కసు: స్థానిక ఘర్షణల నేపథ్యం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్.. ప్రవాస భారతీయుల్లో తీవ్ర ఆగ్రహం



2

# తెలంగాణ -తురింగియా మధ్య కీలక ఒప్పందం

## సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకారం

- యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు: సీఎం రేవంత్ రెడ్డి
- రంగంలోకి 'యాంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ', ఏటీసీలు
- జర్మనీ అవసరాలకు తగ్గట్టుగా తెలంగాణ యువతకు శిక్షణ
- త్వరలోనే తెలంగాణకు జర్మన్ సెమీకండక్టర్ కంపెనీల ప్రతినిధి బృందం
- 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై జర్మనీ ప్రతినిధుల ప్రశంసలు

హైదరాబాద్,
తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, ధురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

-మిగతా 2 లో






## జూన్ 10న నెహ్రూ రికార్డ్ బ్రేక్

- 4,399 రోజులతో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానిగా మోదీ
- ఇందిరా గాంధీ రికార్డును దాటేసిన మోదీ
- నాడు 34 కోట్లు.. నేడు 146 కోట్ల జనాభా
- 53 పార్టీల నుండి 744 పార్టీల పోటీ వరకు
- 17 కోట్ల నుండి 84 కోట్లకు పెరిగిన ఓటర్లు
- నాడు కాంగ్రెస్ ఆధిపత్యం.. నేడు మోదీ హవా

న్యూఢిల్లీ,
నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా

-మిగతా 2 లో




## కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

- ఉప ముఖ్యమంత్రిగా జీ. పరమేశ్వర్..
- మొత్తం 13 మందితో సరికొత్త క్యాబినెట్
- రాజ్యాంగ మినీ బుక్‌తో ప్రమాణం..
- వేదికపై సాష్టాంగ నమస్కారం చేసిన డీకే
- సిద్ధరామయ్య, ఖర్గే తనయులకు దక్కిన మంత్రి పదవులు
- హాజరైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి

బెంగళూరు,
కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన

-మిగతా 2 లో


## దీదీకి ఊహించని షాక్




- 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు
- స్పీకర్‌కు లేఖ.. రితబ్రతను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని వినతి
- ప్రత్యేక బస్సుల్లో అసెంబ్లీకి.. మరో ఇద్దరు కూడా సిద్ధం!
- మమత చేతుల్లో మిగిలేది 20 మందేనా?
- అభిషేక్ కల్యాణ్ బెనర్జీ ప్రతిపాదన వర్సెస్ తిరుగుబాటుదారుల డిమాండ్
- టీఎంసీకి ప్రతిపక్ష హోదా కూడా గండంలోనే!
- సస్పెన్షన్ వేటు.. ఫోర్జరీ ఆరోపణల నేపథ్యం

2

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం



- 21 మంది దుర్మరణం
- మాల్వియా నగర్ 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' బేస్‌మెంట్‌లో మొదలైన మంటలు
- ప్రమాద సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా.. బాధితుల్లో విదేశీయులు!
- రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది.. 20 మందికి పైగా తీవ్ర గాయాలు
- అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల ఎక్స్‌గ్రేషియా

2

## ఆరోగ్యం ఉంటేనే సంపద

- సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు
- యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు
- 21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి



గుంటూరు,
ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా

-మిగతా 2 లో

# తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

## పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ కౌంటర్



- రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అన్నం తినలేదు అన్నావు..
- మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా
- మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా
- పవన్ కళ్యాణ్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక

హైదరాబాద్,
తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా

-మిగతా 2 లో



## పంట అవశేషాలకు నిప్పు పెడితే కేసులు

- ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా
- వాతావరణ సవాళ్లకుదీటుగా ప్రత్యామ్నాయ పంటల సాగు
- ప్రత్యామ్నాయ పంటల సాగు, నానో యూరియాపై అవగాహన
- ఖరీఫ్ సాగు ప్రణాళికపై.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి
వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, కాబట్టి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా అని తెలిపారు. పంట అవశేషాలకు నిప్పు పెడితే కేసులు పెడతామని హెచ్చరిం చారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయా నంద్‌తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. దేశీయ,

-మిగతా 2 లో

# తెలంగాణ -తురింగియా మధ్య కీలక ఒప్పందం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# దీదీకి ఊహించని షాక్

- 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు
- స్పీకర్‌కు లేఖ.. రితబ్రతను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని వినతి
- ప్రత్యేక బస్సుల్లో అసెంబ్లీకి.. మరో ఇద్దరు కూడా సిద్ధం!
- మమత చేతుల్లో మిగిలేది 20 మందేనా?
- అభిషేక్ కల్యాణ్ బెనర్జీ ప్రతిపాదన వర్సెస్ తిరుగుబాటుదారుల డిమాండ్
- టీఎంసీకి ప్రతిపక్ష హోదా కూడా గండంలోనే!
- సస్పెన్షన్ వేటు.. ఫోర్జరీ ఆరోపణల నేపథ్యం




న్యూఢిల్లీ

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీకి షాక్ తగిలింది. 58 మంది ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేశారు. వారంతా కలిసి ఏకంగా అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా బెనర్జీని తమ పార్టీ తరఫున అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని స్పీకర్‌ను కోరారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు.బుధవారం వీరంతా ప్రత్యేక బస్సుల్లో బెంగాల్ అసెంబ్లీకి చేరుకున్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలకు రితబ్రతా బెనర్జీ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. టీఎంసీలో 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో 58 మంది ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతగా రితబ్రత పేరు సూచిస్తూ మద్దతు నిలిచారు. ఆయన చెప్పినట్లు పార్టీపై 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తే మమత పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారు. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు మమతా బెనర్జీకానీ, టీఎంసీ అగ్రనాయకత్వం కానీ స్పందించలేదు. మరోవైపు టీఎంసీ అగ్రనేత అభిషేక్ కల్యాణ్ బెనర్జీ తాజాగా ఎక్స్‌లో స్పందించారు. తన పార్టీ తరఫున అసెంబ్లీలో హోదాలకు సంబంధించి కీలక ప్రతిపాదనల్ని స్పీకర్‌కు పంపించారు. ఆయన ప్రకారం.. శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని కోరారు. కానీ, ఇప్పుడు అత్యధిక శాతం ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు పలకడంతో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. రితబ్రతనే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తే మమత ఆధ్వర్యంలోని టీఎంసీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఇటీవలే రితబ్రతతోపాటు సందీపన్ సాహాను కూడా టీఎంసీ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పార్టీ అగ్రనాయకత్వం తమ సంతకాలను ఫోర్జరీ చేసిందని వీరు ఫిర్యాదు చేయడంతో టీఎంసీ వీరిని సస్పెండ్ చేసింది.

# ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం



న్యూఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ఆరోగ్యం ఉంటేనే సంపద

మొదటి తరువాయి

తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

మొదటి తరువాయి

చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కళ్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు.1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు.1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు.

# పందెం కాస్తే నేరమే!

మొదటి తరువాయి

దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందెలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పులపాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం విధించడం సరైనదేనని న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం నుంచి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువడింది

# జూన్ 10న నెహ్రూ రికార్డ్ బ్రేక్

మొదటి తరువాయి

కొనసాగారు.ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951--52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

మొదటి తరువాయి

సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.

జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లోట్ తావర్‌చందర్ గెహ్లోట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి,

కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమెరికాలో త్రివర్ణ పతాకానికి అవమానం



న్యూయార్క్

అమెరికాలో భారత జాతీయ జెండాకు అవమానం జరిగింది. టెక్సాస్‌లోని ఫ్రిస్కో సిటీ హాల్ బయట క్లేటన్ వాకర్ అనే వ్యక్తి నోట్లో సిగరెట్ ఉంచుకుని.. భారత జెండాను చింపేస్తూ బూతులు మాట్లాడాడు. పక్కనే ఉన్న కొందరు అమెరికన్లు చప్పట్లు కొడుతూ భారత వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ ఘటన ఎప్పుడు జరిగిందో తెలియరాలేదు. కాగా ఫ్రిస్కో సిటీలో ఇండియన్ల జనాభా పెరిగిపోతున్నదని.. వాళ్లే ఆక్రమించేసుకుంటున్నారంటూ అక్కడ వ్యతిరేకిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# పంట అవశేషాలకు నిప్పు పెడితే కేసులు

మొదటి తరువాయి



అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు.
తదనుగుణంగా ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జలాశయాల్లో డెడ్ స్టోరేజ్ నీటిని తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై అందిస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసర మైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్టు తెలిపారు.

# కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

**ఖానాపూర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు జూన్ 10న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని కమిషనర్ సుందర్ సింగ్ తెలిపారు. మున్సిపల్ పరిపాలనలో అనుభవజ్ఞులైన, సీనియర్ సభ్యులను మైనార్టీ నుండి ఇద్దరు చొప్పున ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ కోరారు. జూన్ 10లోగా దరఖాస్తులు సమర్పించాల్సిందిగా అధికారులు సూచించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



**పెద్దపల్లి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడ నిర్మాణం, శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు నేరాల నియంత్రణలో టెక్నాలజీ వినియోగం మంచి ఫలితాలు ఇస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దొంగతనాలు, హత్యలు వంటి సంఘటనల్లో నిందితులను పట్టుకోవడంలో పోలీసులు టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తున్నారని అభినందించారు. పోలీస్ స్టేషన్లలో అవినీతికి తావు లేకుండా పోస్టింగులు జరుగుతున్నాయని, పెద్దపల్లి నియోజకవర్గంలో పోలీసులు నేరాల నియంత్రణకు నిరంతర కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో నాలుగు పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలు నిర్మించనున్నట్లు, ఏసీపీ కార్యాలయానికి కూడా నూతన భవనం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీ, డీసీపీ, ఏసీపీ, పోలీస్ అధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నేరాల నియంత్రణలో టెక్నాలజీ వినియోగం కీలకమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా సైక్లింగ్ ర్యాలీ



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుండి ఎలగందుల ఖిల్లా వరకు సైక్లింగ్ ర్యాలీ ఘనంగా జరిగింది. జిల్లా అటవి అధికారి సత్యనారాయణ, ఏసీపీ విజయ్ కుమార్, అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బి. మధుసూదన్ రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని, గుండె సంబంధిత వ్యాధులను తగ్గించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు. అసోసియేషన్ చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ బరువు తగ్గించడంలో, ఒత్తిడి తగ్గించడంలో, మానసిక ప్రశాంతత కల్పించడంలో అద్భుతమైన వ్యాయామమని పేర్కొన్నారు. అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని, పోటీల ద్వారా సైక్లింగ్ పట్ల ఆసక్తి పెంచామని తెలిపారు. ఉత్సాహంగా సాగిన ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకోవాలని అధికారులు, నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

-మండల మహాసభలో నారి ఐలయ్య పిలుపు




**మర్రిగూడ, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలో జరిగిన మండల మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య మాట్లాడుతూ, కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పనులు 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేల రూపాయలు ఇస్తామని మూడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఇకనైనా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆపాలని ప్రభుత్వాలను ఆయన కోరారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్యతో పాటు పలు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాలు



**పాలకుర్తి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, అందుకోసం సబ్సిడీ రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ తెలిపారు. పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించి, కొత్తగా సాగు చేసే రైతులకు సబ్సిడీతో బోర్ బావుల తవ్వకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు రెట్టింపు ఆదాయం ఇస్తుందని, నియోజకవర్గంలో రైతులు అధిక సంఖ్యలో ఈ పంట సాగుపై దృష్టి సారించాలని కోరారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో విద్యుత్, రోడ్డు సౌకర్యం, బోర్ బావులపై సబ్సిడీ అందించడం శుభపరిణామమని ఆయన అన్నారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఆయిల్ పామ్ గెల ధర టన్నుకు ?23,852 ఉందని, త్వరలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కూడా అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## నూతన కమిటీ పార్టీ సిద్ధాంతాల సాధనకు కృషి చేయాలి

– జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**గన్నేరువరం, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీజేపీ జాతీయ నాయకత్వం సూచన మేరకు రాష్ట్ర నాయకత్వం మార్గదర్శనంలో గన్నేరువరం మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ, సమర్పణ, దేశభక్తి పార్టీకి మూల సూత్రాలని, పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రతి గడపకు తీసుకెళ్లే విధంగా నూతన కమిటీ పని చేయాలని కోరారు. అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీలో స్థానం ఉంటుందని, కొత్త ఉత్సాహంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఉపాధ్యక్షులుగా సామ రాజిరెడ్డి, గాలిపెల్లి శంకర్, పంబ్బాల రాజశేఖర్, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, సెక్రటరీలుగా సిహెచ్. చంద్రయ్య, బూట్ల సంపత్, బద్దం శివారెడ్డి, గుండ భారతమ్మ, కోశాధికారిగా బద్దం అనంతరెడ్డి ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కర్ర అనూష రెడ్డి, కన్నం మనోజ్, గడ్డం రమణారెడ్డి, గుంటుక లక్ష్మంపతి, నందికొండ సురేందర్ రెడ్డి, దాసరి కరుణాకర్, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, టేకు రాజేశ్వరి, జాలి శ్రీనివాస్ రెడ్డి, బుర్ర సత్యనారాయణ, మునిగంటి లింగయ్య, బోయింది జ్యోతి, పి. స్వప్న, టీ. శారద, ఏ. పద్మ, బి. లక్ష్మి తదితరులు ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు. నూతన కమిటీ పార్టీ సిద్ధాంతాల సాధనకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

# శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**అమ్రాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి చెందిన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధిలో భాగంగా రూ.1 కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, యాత్రికుల ఇబ్బందులను తొలగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర ద్వారం మార్గాన్ని ఎక్కువగా ఉపయోగించే భక్తులకు కొత్త సీసీ రోడ్డుతో రాకపోకలు సులభతరం అవుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బీరం మాధవ రెడ్డి, సర్పంచ్ శివ, నాయకులు లోక్య, లచ్చు నాయక్, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, పార్టీ కార్యకర్తలు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఉమామహేశ్వర క్షేత్ర అభివృద్ధి దిశగా కొత్త సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

## పద్మశాలి సంఘ భవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం



**ఖానాపూర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనిక మహేందర్, 8వ వార్డు కౌన్సిలర్ బొప్పారం సత్యవతి మల్లేష్‌లను పద్మశాలి సంఘం సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తదనంతరం పద్మావతి నగర్, తిమ్మాపూర్, విద్యానగర్ 1, విద్యానగర్ 2 ప్రాంతాల పద్మశాలి సంఘ సభ్యులు కూడా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మౌనిక మహేందర్ మాట్లాడుతూ, సంఘ భవనం అభివృద్ధికి కృషి చేస్తానని, ఎంపీ ఫండ్స్‌తో మౌలిక సదుపాయాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఏ. రాజన్న, ప్రధాన కార్యదర్శి ఏ. రమణయ్య, ఉపాధ్యక్షుడు బింగి అనిల్ కుమార్, కోశాధికారి ఆర్. భీమేశ్వర్, కార్యవర్గ సభ్యులు, నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. పద్మశాలి సంఘం సన్మానం చైర్‌పర్సన్‌కు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

## జెడ్పిహెచ్ఎస్‌లో హెచ్ఎం వీ.మునిందర్ రాజు సమక్షంలో బడిబాట కార్యక్రమం



**ఖానాపూర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలోని సుర్జాపూర్ జెడ్పిహెచ్ఎస్‌లో హెచ్ఎం వీ. మునిందర్ రాజు, ఉపాధ్యాయుడు దురిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్యా ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ పలువురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అంతకుముందు గ్రామ సభలో పాఠశాల అభివృద్ధి, బలోపేతానికి ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మెన రాకేష్, గాజుల శ్రీనివాస్, పీర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో విద్యా చైతన్యం పెంపొందించడమే బడిబాట కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

# వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడిగా సలీం

**నల్లగొండ, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వీడియో జర్నలిస్టుల విభాగం నూతన కార్యవర్గాన్ని జిల్లా మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎస్.కె. సలీం, ఉపాధ్యక్షుడిగా తిరుమల శంకర్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి నూతన కార్యవర్గ సభ్యుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తూ, ఏకగ్రీవ నియామకాన్ని వెల్లడించారు.



## ఘనంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలు





**కరీంనగర్/పెద్దపల్లి/బెజ్జంకి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. బెజ్జంకి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, సాగునీటి రంగ అభివృద్ధికి హరీష్‌రావు చేసిన సేవలు అపారమని, ఆయన యువతకు ఆదర్శమని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, హరీష్‌రావు తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ రాష్ట్రానికి విశేష సేవలు అందించారని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడని కొనియాడారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. హరీష్‌రావు ప్రజా సేవలో నిండు నూరేళ్లు కొనసాగాలని నేతలు ఆకాంక్షించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇప్పటికే 90 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని, మిగిలిన ధాన్యాన్ని మరో మూడు నాలుగు రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు. ప్రతిపక్షాలు ఆరోపణలు చేసినా రైతులు వాటిని నమ్మలేదని, రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, జూన్ మొదటి వారంలోనే మొత్తం కొనుగోలు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాము, సర్పంచ్ గునుకొండ బాబు, ఆకుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎంపీడీవో వసంతలక్ష్మి,



**మంచాల, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంచాల మండల నూతన ఎంపీడీవో వసంతలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలకు అందేలా చూడాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. మంచాల మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి మంచి ఎంపీడీవోగా పేరు తెచ్చుకోవాలని వసంతలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహకార బ్యాంక్ డైరెక్టర్లు వింజమూరి రాంరెడ్డి, జెనిగే వెంకటేశ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండెమోని మల్లేష్, పాలకుర్ల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## పదవ తరగతి ఉత్తమ విద్యార్థులకు ఘన సన్మానం



**గన్నేరువరం, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్‌కు చెందిన పదవ తరగతి ఉత్తమ విద్యార్థులను తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు కృషి చేసి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. 500కు పైగా మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులను అభినందించారు. వారిలో చొక్కాల వర్షిణి 572 మార్కులు సాధించి ఐఐఐటీ బాసరలో సీటు పొందడం ప్రత్యేకంగా ప్రశంసనీయమని అన్నారు. సన్మానం పొందిన విద్యార్థులు వాగ్దేవి విద్యా మందిర్ పూర్వ విద్యార్థులుగా ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, వాగ్దేవి విద్యా మందిర్ కరస్పాండెంట్ బూట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుగగోని మల్లేశం, ఉప సర్పంచ్ న్యాలపట్ల రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం అని హన్మండ్ల భాస్కర్ పేర్కొన్నారు.

## ఘనంగా మహిళా డిగ్రీ కళాశాలలో పర్యావరణ దినోత్సవం వేడుకలు



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు, పోటీలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామగుండం డివిజన్ టీఎస్‌పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిక్షపతి మాట్లాడుతూ యువతే పర్యావరణ పరిరక్షణకు రాయబారులని, కాలుష్య నియంత్రణ, నీటి వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణలో వారి పాత్ర కీలకమని అన్నారు. భవిష్యత్ తరాలకు హరిత భవిష్యత్తు అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోస్టర్ మేకింగ్, వీధి నాటిక, గ్రీన్ ఫిల్మ్ మేకింగ్, వాదవివాదం, క్విజ్, నినాద రచన, ఫోటోగ్రఫీ, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, నీటి సంరక్షణ వంటి అంశాలను ప్రతిబింబించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డా. శ్రీనివాస్ రెడ్డి, డా. విద్య, స్వరూప రాణి, రవళి, సుజాత, ఎకో క్లబ్ కన్వీనర్ డా. ఎన్. మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పచ్చని పర్యావరణం -- ప్రకాశవంతమైన భవిష్యత్తు అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థినుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించింది.

## ఎలగందుల చెరువు, బ్రిడ్జి అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు



**కరీంనగర్ రూరల్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలగందుల పెద్ద చెరువు అభివృద్ధికి రూ.10 లక్షల నిధులతో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులు చేపడతామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు తెలిపారు. చెరువు అభివృద్ధి ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడంతో పాటు మత్స్య సంపద పెరిగి మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. అలాగే 2016లో ప్రారంభమైన ఎలగందుల బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమైందని, పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించి పనులను వేగవంతం చేసి త్వరలో పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. బ్రిడ్జి పూర్తయితే కరీంనగర్--వేములవాడ మధ్య ప్రయాణ దూరం తగ్గి పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, సర్పంచ్ నిమ్మల అంజన్న, ఉపసర్పంచ్ గసిగంటి కుమార్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎలగందుల చెరువు, బ్రిడ్జి అభివృద్ధి పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు.

## ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించిన శాస్త్రవేత్తల బృందం



**మంచల, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచల గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని శాస్త్రవేత్తల బృందం నిర్వహించింది. రైతులలో రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడటాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడడం, సాగు ఖర్చులను తగ్గించడం, ఆదాయాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. జీవ ఎరువుల ప్రాముఖ్యత, సమీకృత తెగుళ్ల నివారణ, పచ్చిరొట్ట పంటల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ర్యాపిడ్ సాయిల్ టెస్ట్ కిట్ వినియోగంపై ప్రదర్శన ఇచ్చి, అజోస్పిరిల్లమ్, పీఎస్‌బీ జీవ ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. సుమారు 50 మంది రైతులు చురుకుగా పాల్గొని సాంకేతిక సలహాలు పొందారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మనస, వార్డు సభ్యులు, ఏఈఓ సాయి సిరి, ఏఈఓ నిఖితతో పాటు గ్రామ ప్రతినిధులు హాజరయ్యారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం.

## రిసానాన్స్ అకాడమీ ప్రచారానికి వ్యతిరేకంగా ఏఐఎఫ్బి జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ ధర్నాకు పిలుపు

**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అనుమతిలేని రిసానాన్స్ అకాడమీ ప్రచారాన్ని అడ్డుకుంటామని ఏఐఎఫ్బి జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ ప్రకటించారు. జూన్ 4న ఎలైట్ హోటల్‌లో మాజీ ఐపీఎస్ జెడి లక్ష్మీనారాయణ పాల్గొననున్న ప్రచారానికి వ్యతిరేకంగా ధర్నా చేపడతామని ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును అవకాశవాదంగా తీసుకోవడాన్ని సహించబోమని హెచ్చరించారు. అనుమతి లేని పాఠశాలలు, కళాశాలలు, అకాడమీలకు ప్రచారం చేయడం తగదని, నిబంధనల ప్రకారం మాత్రమే అకాడమీలు నడవాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుమతి లేని అకాడమీలకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగిస్తామని ఏఐఎఫ్బి ప్రకటించింది.




## శాతవాహనలో విజయవంతంగా ముగిసిన వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షలు



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
:శాతవాహన విశ్వవిద్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వ్యాయామ విద్య-2026 ప్రవేశ పరీక్షలు నాల్గవ రోజు ముగిశాయి. ఉపకులపతి ఆచార్య ఉమేష్ మాట్లాడుతూ, వ్యాయామ విద్యతో శారీరక-మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా యువతకు పుష్కలమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కొత్త ఉద్యోగాలు ఏర్పడుతున్నాయని, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆరోగ్యకర జీవనశైలి వ్యాయామ విద్య ద్వారా సాధ్యమవుతాయని అన్నారు. కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ మాట్లాడుతూ, పరీక్షలు అన్ని సౌకర్యాలతో సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. చివరి రోజు బాచిలర్ కోర్సులో 478 దరఖాస్తుల్లో 360 మంది హాజరయ్యారని, డిప్లొమా కోర్సులో 199 దరఖాస్తుల్లో 123 మంది హాజరయ్యారని చెప్పారు. మొత్తం నాలుగు రోజుల్లో బాచిలర్‌లో 2386 దరఖాస్తుల్లో 1788 మంది, డిప్లొమాలో 976 దరఖాస్తుల్లో 647 మంది హాజరయ్యారని, హాజరు శాతం వరుసగా 74.9% మరియు 66%గా నమోదైందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, డాక్టర్ హరికాంత్, డాక్టర్ జాఫర్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ నజీముద్దీన్ మునవర్, ఇతర అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు. వ్యాయామ విద్యతో ఆరోగ్యకర జీవనశైలి, ఉపాధి అవకాశాలు కలుగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## సువార్తమ్మ ఆత్మకు శాంతి చేకూరాలి

**నివాళులు అర్పించిన పూల్యాల దివ్య నాగిరెడ్డి**

**నందికొట్కూరు, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల గ్రామానికి చెందిన సువార్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. వైసీపీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని గుర్తుచేసుకుంటూ పూల్యాల దివ్య నాగిరెడ్డి నివాళులు అర్పించారు. "వారి ఆత్మకు శాంతి చేకూరాలి. కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటాం" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, యువరైతు సుధాకర్, రవి, ప్రేమరాజ్, ఇబ్రహీం తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.




# పెద్దపల్లిలో మట్టి మాఫియా, ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ నిరసన




**పెద్దపల్లి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి నియోజకవర్గంలో అక్రమ మట్టి మాఫియా దందా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్ల దోపిడీని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నేతృత్వంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా జరిగింది. అనంతరం రాజీవ్ రహదారిపై బైఠాయించి రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ దందాలు అడ్డగోలుగా సాగుతున్నాయని, చెరువుల్లో మట్టి మాఫియా చెలరేగిపోతోందని ఆరోపించారు. అధికారులు టిప్పర్ల లెక్కన అనుమతులు ఇస్తూ, ఒక్క రసీదుపైనే పదుల సంఖ్యలో లారీలు మట్టిని తరలిస్తున్నారని, భారీ ఓవర్‌లోడ్‌తో రోడ్లు ధ్వంసమవుతున్నాయని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లలో కూడా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్తాకు అదనంగా తూకం వేసి, మిల్లుల్లో ట్రక్ షీట్లు మార్చి 'తరుగు' పేరిట రైతులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఠాకూర్ రఘువీర్ సింగ్, ఉప్పు రాజ్ కుమార్, వంగల తిరుపతిరెడ్డి, మోహన్ రావు, సందీప్ రావు, కొయ్యడ సతీష్ గౌడ్, పెంచాల శ్రీధర్, వెన్నం రవీందర్, మార్కు లక్ష్మణ్, సలేంద్ర రాములు యాదవ్, బైరెడ్డి రాంరెడ్డి, బాలసాని ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కలెక్టర్‌ను కోరారు.

# మంత్రి పొన్నం వ్యాఖ్యలపై జనసేన ఆగ్రహం



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో నిర్వహించనున్న నవ నిర్మాణ సభను జీర్ణించుకోలేక పొన్నం ప్రభాకర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి విరుద్ధంగా పొన్నం నోటి దూల మారిందని మండిపడ్డారు. కరీంనగర్‌లో పోటీ చేయడానికి భయపడి ఇతర జిల్లాకు వెళ్లి, ఒప్పందాలతో గెలిచిన పొన్నం ప్రభాకర్‌కు పవన్ కళ్యాణ్‌పై మాట్లాడే హక్కు లేదని బేతి మహేందర్ రెడ్డి అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు కొనసాగితే రాబోయే ఎన్నికల్లో డిపాజిట్ కూడా గల్లంతవుతుందని హెచ్చరించారు. పొన్నం వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవానికి చేటు అని జనసేన నేతలు తీవ్రంగా విమర్శించారు.

# పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం




**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన పవన్ కళ్యాణ్‌కు ఇక్కడి రాజకీయాల్లో స్థానం లేదని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కరీంనగర్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు యువకులు పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ గతంలో తెలంగాణ ప్రజలను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని, ఇక్కడి రాజకీయాల్లో జోక్యం చేసుకోవాలని ప్రయత్నిస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. కొండగట్టుకు ఇచ్చిన నిధులు ఆయన సొంత డబ్బులు కావని, రాష్ట్రం ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పిన పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చూసుకోవాలని సూచించారు. సినిమా షూటింగులకు రావడంలో ఇబ్బంది లేదని, కానీ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తే గుణపాఠం తప్పదని అన్నారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని, కవిత నాయకత్వాన్ని బలోపేతం చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన బలమైన శక్తిగా ఎదుగుతుందని హరిప్రసాద్ స్పష్టం చేశారు. రేపటి నుండి జిల్లావ్యాప్తంగా 'జెండా పండుగ' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో లింగంపల్లి నాగరాజు, ఏనుగు మల్లారెడ్డి, కుతాడి శ్రీనివాస్, అంకం శివరాణి, శ్రీరాముల రమేష్, రంగరవేణి లక్ష్మణ్, బాసనేని రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. పవన్ వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని రక్షణ సేన నేతలు తీవ్రంగా ధ్వజమెత్తారు.

# జూన్ 5న విద్యా పరిరక్షణకై ఛలో హైదరాబాద్ కారక్రమం



**హుస్నాబాద్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** విద్యా రంగ పరిరక్షణ కోసం జూన్ 5న హైదరాబాద్‌లో జరగనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో డీటీఎఫ్ హుస్నాబాద్ జోన్ ఆధ్వర్యంలో సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు జరగనున్న ర్యాలీ, ధర్నాకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యా సమస్యల పరిష్కారం కోసం ఈ ఉద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతి రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు వి. వెంకటరమణరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. విద్యా రంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు ఐక్యంగా నిలవాలని డీటీఎఫ్ పిలుపునిచ్చింది.

# మైనారిటీలకు వృత్తి శిక్షణ సంస్థల దరఖాస్తుల ఆహ్వానం




**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అర్హులైన మైనారిటీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వృత్తి శిక్షణ సంస్థలను ట్రైనింగ్ పార్ట్నర్లుగా నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఎన్ఎస్‌డీసీ అనుబంధ వృత్తి శిక్షణ సంస్థలు అవసరమైన ధృవపత్రాలతో జూన్ 15లోపు కరీంనగర్ జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాల కోసం 08782-957085 నంబరులో సంప్రదించవచ్చని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. అర్హత కలిగిన సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# వరి కొయ్యకాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన సదస్సు



**హుస్నాబాద్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అక్కన్నపేట మండలం పంతుల్ తండా గ్రామంలో వరి కొయ్యకాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి సబిహా మాట్లాడుతూ, పొలాల్లో మిగిలిపోయే కొయ్యకాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వలన హానికర వాయువులు విడుదలై పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజల్లో శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు రోటవేటర్ సహాయంతో అవశేషాలను భూమిలో కలియదున్నాలని, వేస్ట్ డికంపోజర్ లేదా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ చట్టం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.27 ప్రకారం పంట అవశేషాలను కాల్చడం నిషేధమని, ఉల్లంఘనలకు రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పంట అవశేషాల నిర్వహణపై అవగాహన పొందారు.

# ఓవర్సీస్ స్కాలర్షిప్స్ దరఖాస్తులకు ఆహ్వానం




**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓవర్సీస్ స్కాలర్షిప్స్ స్ప్రింగ్ సీజన్–2026కు దరఖాస్తుల ఆహ్వానం లభించింది. జనవరి 1 నుండి జూన్ 30, 2026 మధ్య విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశం పొందిన మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా దేశాల్లో చదువుకోదలచిన విద్యార్థులు అర్హులు. ఉపకార వేతనం రూ.20 లక్షలు, టికెట్ ఖర్చు గరిష్టంగా రూ.60,000 వరకు అందించబడుతుంది. ఆదాయ పరిమితి రూ.5 లక్షలు మించరాదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు –వెబ్సైట్ ద్వారా జూన్ 30, 2026 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలి. సంబంధిత పత్రాలను జూలై 31, 2026లోపు కరీంనగర్ కలెక్టరేట్ భవనంలోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయానికి అందజేయాలి. సందేహాల కోసం 08782-957085 నంబరులో సంప్రదించవచ్చు. విదేశీ విద్యకు ఆసక్తి ఉన్న మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. లిలి

# నిర్లక్ష్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

**ముచ్చుమరి--ఓర్వకల్లు పైప్‌లైన్ పనులపై కలెక్టర్ ఆదేశాలు**



**నందికొట్కూరు, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముచ్చుమరి నుంచి ఓర్వకల్లు వరకు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నీటి పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులో, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం క్షేత్రస్థాయిలో పనులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, పైప్‌లైన్ ఏర్పాటు, నిర్మాణ నాణ్యత, సాంకేతిక అంశాలు, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. "ప్రతి దశను పర్యవేక్షిస్తూ ముందుకు సాగాలి. ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశ్రామిక అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యం కలిగినది" అని ఆమె పేర్కొన్నారు. నందికొట్కూరులో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పెండింగ్ పనులను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పనుల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పైప్‌లైన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తయితే తాగునీటి సరఫరా మెరుగుపడటమే కాక పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఆత్మకూర్ ఆర్డీఓ వెంకట శివ, నందికొట్కూరు తహశీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, టిపిఓ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు పొడగింపు - సిపి గౌష్ ఆలం



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలంటే సంబంధిత ఏసీపీ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా జరిగే కార్యక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డిజె సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాన్ని ఈ నెల 30 వరకు పొడిగించారు. శబ్ద కాలుష్యం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. అవసరమైతే మైక్ సెట్లు వినియోగించడానికి సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు.అదేవిధంగా భద్రతా కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, డ్రోన్లు, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ వినియోగాన్ని కూడా ఈ నెల 30 వరకు నిషేధించారు. వివాహాలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల్లో వీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపిసి 188తో పాటు హైదరాబాద్ నగర పోలీస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.

## అంగన్వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం



**గంగాధర, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పత్తికుంటపల్లి అంగన్వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 3౦ పిల్లల గృహ సందర్శన చేసి వారిని అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆటపాటలతో పాటు ఆంగ్లంలో బోధన అందిస్తామని, పిల్లలను నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అమ్మ మాట -- అంగన్వాడీ బాట అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఓ, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, తల్లులు, పిల్లలు, గ్రామస్తులు పాల్గొన్నారు.ప్రతి చిన్నారి విద్యా ప్రయాణానికి అంగన్వాడీ కేంద్రాలు తొలి మెట్టుగా నిలుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## టవర్ సర్కిల్‌లో ఆగిపోయిన పెద్ద గడియారం



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్‌కు తలమాణిక్యంగా నిలిచిన ప్రధాన మార్కెట్ చౌరస్తా వద్ద ఉన్న పెద్ద గడియారం (టవర్ సర్కిల్) గత కొన్ని రోజులుగా పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలచక్రాలు ఆగిపోవడంతో నగరానికి ప్రతీకగా నిలిచిన ఈ గడియారం మళ్లీ యథావిధిగా నడవాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించి మరమ్మత్తులు చేపట్టాలని కార్పొరేషన్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.కరీంనగర్ ప్రజలు తమ నగర ప్రతీక అయిన పెద్ద గడియారం మళ్లీ మోగాలని ఎదురుచూస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో నూతన పాఠశాల భవనానికి టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. అనంతరం బడి బాట కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రజలను కోరారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తరువాత బాదన్‌కుర్తి గ్రామంలో నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించి, విద్యార్థులతో తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలల్లో కొత్త భవనాలు, ల్యాబ్‌లు, కిచెన్ షెడ్లు, అదనపు గదులు నిర్మిస్తున్నామని చెప్పారు.దిలావర్పూర్ గ్రామంలో ఇందిరమ్మ కొత్త ఇళ్లను ప్రారంభించి, పేద కుటుంబాలకు విడతల వారీగా ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో జంగిలి శంకర్, ప్రశాంత్ రెడ్డి, పార్షపు లోహిత, చింతల మల్లేష్, గాడ్పు సత్యం, పెద్దిరాజు, మాదాస్తు నవీన్, ఓరగంటి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పేదవారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు.

## కడెం మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి



**ఖానాపూర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా కడెం మండల విద్యాధికారిగా కడెం ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.గత మండల విద్యాధికారి షేక్ హుస్సేన్ గత నెలలో పదవీ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ రెడ్డిని పాఠశాల సిబ్బంది, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్సీ-ఎస్టీ జిల్లా నాయకులు రాజేష్ నాయక్ తదితరులు శాలువా కప్పి ఘనంగా అభినందించారు.కడెం మండల విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీనివాస్ రెడ్డి సంకల్పం వ్యక్తం చేశారు.

## ఉత్తర తెలంగాణ అభివృద్ధికై జాతీయ రహదారి విస్తరణ



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కేంద్రం భారీ నజరానా ప్రకటించింది. రూ.7,597 కోట్లతో జాతీయ రహదారుల విస్తరణకు ఆమోదం లభించింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఎన్హెచ్-63, ఎన్హెచ్-563 రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్మూర్--జగిత్యాల, జగిత్యాల--మంచిర్యాల, జగిత్యాల--కరీంనగర్ మార్గాల్లో రహదారి విస్తరణ చేపట్టనున్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా పరిశ్రమలు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రాంతానికి ఇది చారిత్రాత్మక ముందడుగుగా నిలుస్తుందని మేధావులు అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలకు కరీంనగర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్ - బండ ప్రకాష్



**గోదావరిఖని, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులను బీసీ-డి నుండి బీసీ-ఏలో చేర్చాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో ముదిరాజ్‌లు అత్యధిక జనాభా కలిగి వెనుకబడిన వర్గంగా గుర్తించబడినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ఈ మార్పు చేయాలని డిమాండ్ చేశారు.ఆసిఫాబాద్ పర్యటన అనంతరం రామగుండం ఎన్‌టిపిసి జ్యోతి పవన్‌లో నాయకులతో సమావేశమైన ఆయన, రాబోయే రోజుల్లో ముదిరాజ్ విద్యావంతులను ఏకం చేసేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బండ ప్రకాష్ ముదిరాజ్‌ను స్థానిక నాయకులు శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బల్ల సత్తయ్య, పిల్లి శివయ్య, సోమన్న, పిడుగు కృష్ణ ముదిరాజ్, దబ్బెట శంకర్ ముదిరాజ్, అప్పరాజు ప్రభాకర్ ముదిరాజ్, గొలుసు జ్యోతి నాగరాజు ముదిరాజ్, మంద రాజేష్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్ చేస్తూ బండ ప్రకాష్ స్పష్టం చేశారు.

## శాతవాహన యూనివర్సిటీలో మంత్రి పొన్నం చిత్రపటానికి పాలాభిషేకం



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ విభజన, రాష్ట్ర అస్థిత్వంపై జరుగుతున్న విమర్శలకు ఘాటుగా సమాధానమిస్తున్న పొన్నం ప్రభాకర్‌ను అభినందిస్తూ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ,అవును, మా అయ్యా జాగీరే తెలంగాణ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కరీంనగర్ ఉద్యమ పులి బిడ్డగా పొన్నం ప్రభాకర్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరికే మహేష్, వరుణ్ శివాజీ, అశోక్, ప్రవీణ్, లక్ష్మణ్, శ్రీధర్, మహేశ్వరి, లక్ష్మీ, ప్రేమ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతున్న పొన్నం ప్రభాకర్‌కు విద్యార్థులు ఘనాభినందనలు తెలిపారు.

## జిల్లా విద్యాధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన పిఆర్టియు నేతలు



**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నూతన జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. ప్రశాంత్ రెడ్డిని పిఆర్టియు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు, పిఆర్టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, మాజీ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, గెజిటెడ్ హెడ్మాస్టర్ సల్వాజీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఉపాధ్యాయుల సహకారం అందిస్తామని నేతలు తెలిపారు.

## జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



**ఆమనగల్లు, జూన్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఆమనగల్లులో నూతన అదనపు కోర్టు భవన నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రస్తుతం షాద్‌నగర్ పరిధిలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జి కోర్టును మహేశ్వరం ప్రాంతానికి మార్చాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లులో శాశ్వత కోర్టు భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఇటీవల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతి అందజేసినట్లు తెలిపారు. ఈ అంశంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సర్దార్ నాయక్, న్యాయవాదులు మల్లేష్, కృష్ణ, శిరీష్ కుమార్, రమేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయం



**ఆమనగల్లు, జూన్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో రైతులకు సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తో కలిసి సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. జీలుగు విత్తనాల వల్ల భూమి గుల్లబారి అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ లను అందించి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సింగల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, కౌన్సిలర్ ఎనుముల్ల రమేష్, మాజీ మండల అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు అనంతుల సైదులు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ నాయక్, మహేష్, సింగల్ విండో సీఈవో పద్మాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, బాలకృష్ణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**- బస్సు ఢీకొని బాలుడు మృతి వృద్ధురాలికి తీవ్ర గాయాలు**




**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడేళ్ల బాలుడు మృతి చెందగా, ఒక వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన పెద్ది వంశీ (7) తన బంధువుల ఇంటికి వెళ్తుండగా, గోపాల్‌పూర్‌కు చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సు అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వంశీ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వృద్ధురాలు విజయ తలకు, చెవులకు గాయాలతో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై బాలుడి తల్లి పెద్ది లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అజాగ్రత్త డ్రైవింగ్ కారణంగా జరిగిన ఈ ప్రమాదం నగరంలో విషాదాన్ని మిగిల్చింది.

## ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి సమక్షంలో వాహనాల తనిఖీలు






**కరీంనగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ వన్‌టౌన్ ప్రాంతంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, త్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, నంబర్ ట్యాంపరింగ్, సరైన పత్రాలు లేని వాహనాలను పోలీసులు స్టేషన్‌లో ఉంచారు. వాహన యజమానులు లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ పత్రాలు చూపించి పెండింగ్ చాలాన్లు క్లియర్ చేసుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి, ఓవర్ స్పీడ్‌తో వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఏసీపీ యాదగిరి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సంజీవ్, ఆంజనేయులు, ఎస్సైలు శ్రీకాంత్, రామ్మూర్తి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.

## ఘనంగా ప్రారంభమైన బిజెపి ఉపాధ్యాయ శిక్షణ శిబిరం



**రాజన్న సిరిసిల్ల, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ శిబిరం వాసవి కళ్యాణ మండపంలో ఘనంగా ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది ప్రతినిధులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ నాయకుడు మురళీధర్ రావును శాలువాతో సన్మానించి, పార్టీ జెండా ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలు, విలువలు, సేవా భావం ఆధారంగా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శిక్షణా తరగతులు అవసరమని, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలకు అవగాహన కల్పించడంలో ఈ శిబిరం ఉపయోగపడుతుందని తెలిపారు. మొదటి రోజు శిక్షణలో పార్టీ సిద్ధాంతం, చరిత్ర, రాజకీయ పరిస్థితులు, కార్యకర్తల బాధ్యతలు, సంక్షేమ పథకాలు, సోషల్ మీడియా వినియోగం వంటి అంశాలపై సీనియర్ నాయకులు శిక్షణ అందించారు. కార్యక్రమంలో చెన్నమనేని వికాస్ రావు, ప్రతాప రామకృష్ణ, గంగాడి మోహన్ రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కరెడ్ల మధుకర్, ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్, అల్లాడి రమేష్, కుమ్మరి శంకర్, చంటి మహేష్, ఆడెపు రవీందర్, దశరథం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ శిక్షణ శిబిరం దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు.

## షాద్‌నగర్ గ్రేడ్--1 గ్రంథాలయం నూతన లైబ్రేరియన్‌గా బి. వెంకటయ్య



**షాద్‌నగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ గ్రేడ్--1 గ్రంథాలయానికి నూతన లైబ్రేరియన్‌గా బి. వెంకటయ్య పదవీ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి ఆయనను హృదయపూర్వకంగా స్వాగతించి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు నక్క బాలరాజ్, వీరేష్ కుమార్, జనరల్ సెక్రటరీ క్యాసెట్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ జూపల్లి చంద్రశేఖర్, జాయింట్ ట్రెజరర్ కత్తి చంద్రశేఖరప్ప, సభ్యులు మల్లేష్, కృష్ణ, శిరీష్ కుమార్, రమేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి**



**షాద్‌నగర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు సబ్సిడీతో అందించాలని, నెలకు రూ.10 వేల వేతనం హామీని అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్తో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ను కలసి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు 12 నెలల గౌరవ వేతనం, 60 ఏళ్లు దాటిన వారికి రూ.1 లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్, 58 ఏళు దాటిన వారికి నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. అదనంగా హెల్త్ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, ప్రతి నెల ఒకటో తేదీలోపు బిల్లుల చెల్లింపు వంటి డిమాండ్లను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అక్కమ్మ, సత్తెమ్మ, నిర్మల, అనిత, నీలమ్మ, షాహినా బేగం, ఖైరున్, సావిత్రి, కళావతి, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్యకు శుభాకాంక్షలు

**-ఇగ్రమంజిల్లో మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు**



**రంగారెడ్డి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య గారిని బుధవారం ఇగ్రమంజిల్లోని కమిషన్ ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసిన కమిషన్ సభ్యుడు ఆసిఫ్ అలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్ పూల బుకేతో అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు సంకెపల్లి సుధీర్ రెడ్డి, రంగరాజ్, అలాగే రేవంత్ మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

**-ర్యాకల్దేవుపల్లిలో ఉచిత శిక్షణ కేంద్రం**



**ఎలిగేడు, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ అన్నారు. ర్యాకల్దేవుపల్లి గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "కుట్టుమిషన్ శిక్షణతో మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించి కుటుంబాభివృద్ధికి తోడ్పడతారు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఆర్గనైజర్ దీప్తి, వార్డు సభ్యులు ఆసంపల్లి స్వప్న, ఎడ్ల సతీష్, మడ్లపల్లి జయ--శ్రీనివాస్, మడ్లపల్లి అనిత, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# పింఛన్ ఏది సారూ

**-- లబ్ధిదారుల ఆవేదన**

**-ఘట్కేసర్ మున్సిపల్ కార్యాలయంలో గందరగోళం**



**ఘట్కేసర్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో, ఘట్కేసర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం నుంచే లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మంగళవారం వచ్చిన వారిని బుధవారం రమ్మనడంతో, కార్యాలయం వద్ద గందరగోళం నెలకొంది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వెంటనే పింఛన్లు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. అధికారులు మాట్లాడుతూ, "పింఛన్ల ప్రక్రియ ముందుకు సాగుతోంది. సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారులకు పింఛన్లు అందుతాయి" అని నచ్చజెప్పారు.

## ఆసిఫ్ అలీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన పెరుమాండ్ల సురేష్



**తలకొండపల్లి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన ఆసిఫ్ అలీకి తలకొండపల్లి యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 2002 నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట ఉంటూ, ఆయన రాజకీయ ఎదుగుదల కోసం కృషి చేసిన ఆసిఫ్ అలీకి రాష్ట్ర స్థాయి పదవి రావడం పట్ల సురేష్ ఆనందం వ్యక్తం చేశారు.

## అట్టహాసంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, జూన్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాజీ మంత్రి వర్యులు సిద్దిపేట శాసనసభ్యులు,తన్నీరు హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాక్స్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,పాక్స్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, కౌన్సిలర్ పాపిశెట్టి రాము హాజరై బీఆర్ఎస్ పార్టీ నాయకులు సమక్షంలో కేక్ ను కట్ చేయటం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధికి హరీష్ రావు కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. హరీష్ రావు నాయకత్వ స్ఫూర్తితో కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎనమళ్ళ రమేష్,నాయకులు అనంతుల సైదులు గౌడ్, కడ్తాల్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,చలిచీమల సతీష్, గుజ్జరి గోపి, పూసల భాస్కర్, జంతుక కిరణ్, రాముల మహేష్, శ్రీను నాయక్,రేపని శివ పాల్గొన్నారు.

# పరామర్శ, ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, జూన్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన తల్లోజు వెంకటయ్య బుధవారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ అనూష శ్రీశైలం మృతుని పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉప్పల వెంకటేష్ సహకారంతో 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గుజ్జరి గోపి,బిఆర్ఎస్ శ్రేణులు, తదితరులు ఉన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం

-వెల్దండలో నిరుపేద కుటుంబానికి తోడ్పాటు ఇచ్చిన గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని అంకమౌనికుంట గ్రామానికి చెందిన మొకరాల వెంకయ్య ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.25,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు నిర్మించుకోలేని నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడం సామాజిక బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.వెంకయ్య కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించిన గోలి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం -ఘన సన్మానం



**కడ్తాల్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కడ్తాల్ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ ఈవో మోహన్ రావు ఆధ్వర్యంలో గూడూరు జంగారెడ్డి చైర్మన్‌గా, సభ్యులుగా రమేష్ గౌడ్, పిప్పళ్ళ యాదయ్య, బాచిరెడ్డి మంజుల, రాంచందర్ నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు.ముఖ్య అతిథిగా హాజరైన ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా నూతన పాలకవర్గాన్ని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, "దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి. నేను కూడా నా శక్తి మేరకు సహకరిస్తాను" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు, డిసిసి ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ బిఆర్ఎస్ అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం


-అవగాహన కార్యక్రమంలో సూచనలు చేసిన సర్పంచ్ ప్రవీణ్



**ఎలిగేడు,జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాన్ని స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ కప్పల ప్రవీణ్ అన్నారు.ఎలిగేడు జీపీ కార్యాలయంలో బుధవారం ఎస్.జీ.ఎస్.జే--2026 అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. తడి--పొడి చెత్తను వేరు చేయాలి. వర్షాకాలంలో బావులు, కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. రోడ్లపై మురికినీరు నిల్వ లేకుండా చూడాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి" అని సూచించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేశ్, పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నార్వే పార్లమెంట్‌లో ఎంపీ బైరెడ్డి శబరి బృందం

అంతర్జాతీయ అనుభవాలపై విలువైన అవగాహన



**నందికొట్కూరు, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభించడం గౌరవంగా భావిస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.బుధవారం ఆమెతో పాటు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు ఎం. భరత్, ఇతర సహచర పార్లమెంట్ సభ్యులు నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా తిలకించారు.ఈ సందర్భంగా డాక్టర్ శబరి మాట్లాడుతూ, "పాలన, ప్రజా విధానాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై జరిగిన ఆలోచనల మార్పిడి విలువైన అవగాహనను అందించింది. ఒకరినొకరు అనుభవాల గురించి నేర్చుకుంటూ, భవిష్యత్తులో మరింత బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.

# దైవభక్తితో మానసిక ప్రశాంతత

- నూతన పాలకవర్గాన్ని సన్మానించిన ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా
- ఘనంగా కడ్తాల్ చెన్నకేశవ స్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



**ఆమనగల్లు, జూన్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రతి ఒక్కరిలో దైవభక్తి కలిగి ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కడ్తాల్ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ గా గూడూరు జంగారెడ్డి, సభ్యులుగా రమేష్ గౌడ్, పిప్పళ్ళ యాదయ్య, బాచిరెడ్డి మంజుల, రాంచందర్ నాయక్ లను ఆలయ ఈవో మోహన్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గంప వెంకటేష్ గుప్తా ఆలయ చైర్మన్ గూడూరు జంగారెడ్డి తో పాటు సభ్యులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధి కోసం తన శక్తి మేరకు కూడా కృషి చేస్తానని గంప వెంకటేష్ గుప్త తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు కేశవులు గౌడ్, నాగరాజు, కొప్పు కృష్ణ, డిసిసి ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అమృతం పాండు, కృష్ణ, గుద్దేటి సత్యనారాయణ గుప్తా, గుద్దేటి వెంకటేష్ గుప్తా, గుద్దేటి వీరేందర్ గుప్తా, గూడూరు సురేందర్ రెడ్డి, బాచిరెడ్డి రమణారెడ్డి, ఏ సంతోష్, కంబాలపల్లి అంజి, రామచంద్రి, మంగళపల్లి నరసింహ, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శారదా బిచ్చా నాయక్, బాచిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గడ్డంపల్లిలో వారాంతపు సంత ప్రారంభం

-సర్పంచ్ వెన్నెల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం

**తెలకపల్లి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



తెలకపల్లి మండలంలోని గడ్డంపల్లి గ్రామంలో వారాంతపు సంతను సర్పంచ్ బొక్క వెన్నెల బుధవారం ప్రారంభించారు.ప్రతి బుధవారం కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో పాటు చికెన్, మటన్, చేపలు కూడా సంతలో లభ్యమవుతాయని ఆమె తెలిపారు. గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గౌతంపల్లి, అనంతసాగర్, రాయిపాకుల, వనపట్ల, మంతటి గ్రామాల ప్రజలు కూడా ఈ సంతను వినియోగించుకోవాలని కోరారు."వినియోగదారులకు తక్కువ ధరల్లోనే అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. గడ్డంపల్లి గ్రామం కేవలం మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సంత సులభంగా చేరువ అవుతుంది" అని సర్పంచ్ వెన్నెల పేర్కొన్నారు.

## ఊర్కొండలో ఉచిత వైద్య శిబిరం

-సర్పంచ్ మంజుల శ్రీనివాసుల ఆధ్వర్యంలో విజయవంతం



**ఊర్కొండ, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఊర్కొండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మ్యాకల మంజుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ్స్ ఇందిర పిల్లల ఆసుపత్రి కల్వకుర్తి ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది.గ్రామం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు తమ పిల్లల అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 80 మంది పిల్లలకు ఉచిత పరీక్షలు, మందులు అందించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎల్. అర్జున్ చౌహాన్, డాక్టర్ బి. గోపాల్కృష్ణ, అడ్మిన్ భాస్కర్ రెడ్డి, సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పోలే లక్ష్మయ్య, కంఠం రాములు, పోలే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

-కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రవీణ్



మజ్జిగ ,ఓఆర్ఎస్ పంపిణీ చేస్తూ

**ఎలిగేడు, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ కప్పల ప్రవీణ్ బుధవారం సందర్శించి పరిశీలించారు.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయంపూట పనులకు వచ్చి త్వరగా ముగించుకోవాలని ఆయన సూచించారు. పనిస్థలంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, కూలీలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు బ్రహ్మోజు సంజీవ్ కుమార్, పల్లె కార్తీక్, మదుపు నరేందర్, గ్రామ యువకులు, నాయకులు, సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

-బడిబాట కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేసిన తల్లిదండ్రులు



ప్రతిజ్ఞ చేస్తూ



బడిబాట ర్యాలీ

**ఎలిగేడు, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ కప్పల ప్రవీణ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంద్ర దేవేందర్ రావు మాట్లాడుతూ, "బడీడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే డిజిటల్ విద్యాభోధన జరుగుతోంది. గత రెండేళ్లుగా పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం" అని పేర్కొన్నారు.గ్రామసభలో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్న ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, ఉచిత సౌకర్యాలను వివరించారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల చైర్‌పర్సన్ రేఖ, హెచ్ఎం జ్ఞానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి అంజలి, సిఆర్పి లక్ష్మీనారాయణ, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, సరోజ, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**-ఒక వ్యక్తి, 136 గొర్రెలు మృతి" ఘటన**
**- పరామర్శించిన దేవరకొండ ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్ .**





**దేవరకొండ జూన్ 03. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో జరిగిన విషాదకర ఘటనలో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన "గొర్ల కాపరి ఎల్లయ్యతో పాటు 136 గొర్రెలు మృతి" చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు.
ఈరోజు తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, ఆలేరు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , గొర్రెలు మరియు మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత-తిరుపతయ్య , కార్పొరేషన్ డైరెక్టర్ క్యామ మల్లేష్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుల స్వస్థల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తదుపరి దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుడు ఎల్లయ్య మృతదేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణ సహాయంగా యాదవ సంఘం తరఫున రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, గొర్ల కాపరులు తమ జీవనాధారమైన గొర్రెలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, తద్వారా ఇలాంటి అనుకోని ఘటనలు జరిగినప్పుడు ఆర్థిక భద్రత లభిస్తుందని సూచించారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పెట్రోల్--డీజిల్ ధరలపై అచ్చంపేటలో నిరసన

**-ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ**



**అచ్చంపేట, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ అచ్చంపేట పట్టణంలో బుధవారం ర్యాలీ జరిగింది.స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఎండగట్టారు. అనంతరం నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ నిరసనలో ఉప్పునుంతల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మెడమోని భాస్కర్, గ్రామ యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన టిడిపి ప్రముఖులు

-నియోజకవర్గ సమస్యలపై చర్చ



**నందికొట్కూరు, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జ్ గౌరు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కూడా పాల్గొన్నారు.


# ప్రాంతీయవాదం కాదు.. తెలంగాణ ఆత్మగౌరవం: నిరంజన్ రెడ్డి

-తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారుల త్యాగాల ఫలితం
-తెలంగాణ ప్రజల మనోభావాలను అవమానిస్తే సహించబోమని హెచ్చరిక
-కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని వ్యాఖ్య
-కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
-బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహించాలని పిలుపు



వనపర్తి జూన్0 3 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):
తెలంగాణ ఉద్యమాన్ని ప్రాంతీయవాదంగా అభివర్ణించడం చారిత్రక వాస్తవాలను విస్మరించడమేనని, తెలంగాణ రాష్ట్రం అనేక మంది ఉద్యమకారుల త్యాగాలు, ఆత్మబలిదానాల ఫలితంగా సాధించుకున్నదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. దేవరకద్ర నియోజకవర్గ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను కించపరిచే వ్యాఖ్యలను ప్రజలు సహించరని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం స్వాభిమాన పోరాటమని, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలు, అభివృద్ధి అసమానతల కారణంగానే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను మరవలేమన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన ఆత్మార్పణను గుర్తు చేస్తూ, రాష్ట్రాల ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమాలను ప్రాంతీయవాదంగా చిత్రీకరించడం సరైన దృక్పథం కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ప్రజల ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం సాగిన చారిత్రక పోరాటమని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పాలనను ప్రస్తావించిన నిరంజన్ రెడ్డి, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, సాగునీటి ప్రాజెక్టులు వంటి పథకాలు తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది వేశాయని అన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం సైతం అనుసరించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతు సంక్షేమం, ధాన్యం కొనుగోలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సహాయం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీల అమలులో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పని చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి సభ్యత్వ నమోదును పారదర్శకంగా నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ హోంమంత్రి మహ్మూద్ అలీ , రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి వెరీ 'గుడ్డు'..!



ఆరోగ్యకరమైన జీవనానికి సమతుల ఆహారం ఎంత ముఖ్యమో, అందులో గుడ్డు పాత్ర కూడా అంతే కీలకం. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు అందించే గుడ్డు ప్రతి వయస్సు వారికీ మేలు చేసే సంపూర్ణ ఆహారంగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. రోజూ ఒక ఉడికించిన గుడ్డు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా అందుతాయి. గుడ్డులోని పోషకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా పిల్లల ఎదుగుదల, కండరాల బలోపేతం, ఎముకల దృఢత్వానికి గుడ్డు ఎంతో ఉపయోగపడుతుంది. విటమిన్-డి, విటమిన్-బి12, ఐరన్, సెలీనియం వంటి ముఖ్యమైన పోషకాలు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహకరిస్తాయి. గర్భిణులు, బాలింతలు, ఎదుగుతున్న చిన్నారులు తమ రోజువారీ ఆహారంలో గుడ్డును తప్పనిసరిగా చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తల్లి, శిశువు ఆరోగ్యానికి అవసరమైన అనేక పోషకాలను గుడ్డు అందిస్తుందని వారు చెబుతున్నారు. అంతేకాకుండా మెదడు అభివృద్ధి, జ్ఞాపకశక్తి పెంపుదలకు కూడా గుడ్డు దోహదపడుతుంది. ప్రస్తుతం పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల నేపథ్యంలో పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందుబాటు ధరలో లభించే గుడ్డును ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన జీవనానికి బాటలు వేయవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.



మీ
కొంపెల్లి సాగర్,
కరీంనగర్



# బ్రెజిల్ దిగుమతులపై అమెరికా అదనపు సుంకం

**వాషింగ్టన్ జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బ్రెజిల్ నుంచి దిగుమతయ్యే పలు ఉత్పత్తులపై అదనంగా 25 శాతం సుంకం విధించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ వాణిజ్యం, పర్యావరణ నిబంధనల విషయంలో బ్రెజిల్ విధానాల వల్ల అమెరికా కంపెనీలకు నష్టం జరుగుతోందని పేర్కొంటూ ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం, బ్రెజిల్ ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఫలించకపోవడంతో ఈ చర్యకు దిగారు. కొత్త




సుంకం ప్రధానంగా సాంకేతిక పరికరాలు, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక ఉత్పత్తులపై వర్తించనుంది. అయితే అమెరికా మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడకుండా ఉండేందుకు గొడ్డు మాంసం, కాఫీ, అరుదైన ఖనిజాలు, విమాన భాగాలను ఈ సుంకం నుంచి మినహాయించారు. ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**రూ.14 లక్షల నగదు, కారు, నాటు సారాయి స్వాధీనం**




**నంద్యాల, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా డోన్ టౌన్ పోలీస్ పరిధిలో ఏప్రిల్ 20న వేకువజామున ఐటీసీ సిగరెట్ గోడౌన్‌లో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు చేదించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సీసీటీవీ--360 నిఘా వ్యవస్థ సహాయంతో నిందితులను గుర్తించి, జూన్ 3న డోన్ పట్టణం వెలుపల గుత్తి రోడ్డులోని రుద్రాక్ష గుట్ట సమీపంలో అరెస్ట్ చేశారు.అరెస్ట్ చేసిన ముగ్గురు రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు. విచారణలో వారు డోన్‌లో జరిగిన చోరీతో పాటు కడపలో కూడా పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.నిందితుల వద్ద నుండి రూ. 14,01,500/- నగదు, నేరానికి ఉపయోగించిన మారుతి సుజుకి స్విఫ్ట్ కారు, అలాగే 45 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేశారు.ఈ కేసు ఛేదనలో విశేష కృషి చేసిన డోన్ టౌన్ పోలీస్ సిబ్బంది మరియు సీసీఎస్ నంద్యాల బృందంను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ అభినందించారు.


## ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

**సచివాలయ సిబ్బందికి కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు**



**నంద్యాల, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు.బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయంను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో జరుగుతున్న సేవలు, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు, రీ-సర్వే పురోగతి, పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ స్థితి వంటి అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.సిబ్బంది హాజరు వివరాలు, శాఖల రికార్డులను పరిశీలించిన కలెక్టర్, "ప్రజలకు అందించే సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోరాదు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలి. సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను ఓర్పుతో వినాలి" అని సూచించారు.ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి అవసరాలను గుర్తించి సమర్థవంతంగా సేవలు అందించాలని ఆమె ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి, నాణ్యతతో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు."ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సిబ్బంది కృషి చేయాలి" అని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు.

## కాచికల్‌లో కాలువ మరమ్మత్తు పనులకు శ్రీకారం



**మహబూబాబాద్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ నియోజకవర్గంలోని నెల్లికుదురు మండలం కాచికల్ గ్రామంలో కట్టు కాలువ మరమ్మత్తు పనులను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ బుధవారం ప్రారంభించారు.సుమారు 49 లక్షల 65 వేల రూపాయల వ్యయంతో చేపడుతున్న ఈ పనులకు శ్రీకారం చుడుతూ ఎమ్మెల్యే స్వయంగా జేసీబీ నడిపారు. రైతుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామని ఆయన తెలిపారు.కాలువ మరమ్మత్తులతో సాగునీటి సరఫరా మెరుగై రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే కాచికల్--ఎర్రబెల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి పనులను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలి

**-పెరిగిన ధరలతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు**

**-పాలడుగు ప్రభావతి, ఐద్వా జిల్లా కార్యదర్శి**



**తిప్పర్తి,జూన్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పేద మరియు మధ్యతరగతి ప్రజలకు రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. ఈరోజు ఐద్వా ఆధ్వర్యంలో తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజల జీవితం భారంగా మారిందని, కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆమె విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పదేపదే పెంచడం వల్ల రవాణా ఛార్జీలు, కూరగాయలు, ధాన్యాలు, నూనెలు సహా అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. పేద ప్రజల ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం రెట్టింపు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ధనిక వర్గాలకు, కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.ంషన్ వ్యవస్థను బలోపేతం చేసి బియ్యం మాత్రమే కాకుండా పప్పులు, వంటనూనె, చక్కెర, ఉప్పు, కందిపప్పు, సబ్బులు తదితర 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని డిమాండ్ చేశారు. మహిళలు, కార్మికులు, వృద్ధులు, నిరుద్యోగులు పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ కోసం భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ, తిప్పర్తి మండల అధ్యక్షురాలు భార్గవి, మండల సహాయ కార్యదర్శి పోకల ఝాన్సీ , రుక్మిణి, నూకల ఆదెమ్మ, నూకల సుబ్బమ్మ, భాగ్యమ్మ, యాదమ్మ, లక్ష్మి, కమలమ్మ, వెంకటమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ తర్వాత... దారి కాదు, దిశ ఎంచుకోండి!

**- కెరీర్ ఎంపికలో ఆలోచనాత్మక నిర్ణయమే విజయానికి పునాది**

ఇంటర్మీడియట్ పూర్తయిన వెంటనే ప్రతి విద్యార్థి జీవితంలో ఒక కీలక దశ ప్రారంభమవుతుంది. ఇప్పటివరకు పరీక్షలు, మార్కులు, ర్యాంకుల చుట్టూ తిరిగిన ప్రయాణం ఒక్కసారిగా 'ఇక ఏం చేయాలి?' అనే ప్రశ్న వద్ద ఆగిపోతుంది. ఇంజినీరింగ్ చేయాలా? మెడిసిన్ వైపు వెళ్లాలా? సీఏ చదవాలా? లేక మరేదైనా కొత్త రంగాన్ని ఎంచుకోవాలా? అనే సందిగ్ధత సహజమే. ఈ సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు తమ అనుభవాల ఆధారంగా ఎన్నో సలహాలు ఇస్తుంటారు. అయితే ఇతరులు చూపించిన మార్గంలో నడవడం కంటే, తనలోని సామర్థ్యాలు, ఆసక్తులు, లక్ష్యాలను గుర్తించి దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవడమే నిజమైన విజయం. ఇప్పటికీ సమాజంలో కొన్ని అపోహలు బలంగా ఉన్నాయి. బైపీసీ చదివితే మెడిసిన్ తప్ప మరో దారి లేదనుకోవడం, ఎంపీసీ అంటే ఇంజినీరింగ్ మాత్రమే అనుకోవడం, కామర్స్ అంటే సీఏ ఒక్కటే మార్గమని భావించడం, ఆర్ట్స్ తీసుకుంటే అవకాశాలు ఉండవని తేల్చేయడం వంటివి విద్యార్థులను అనవసర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. కానీ వాస్తవం మాత్రం భిన్నంగా ఉంది. నేటి ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతికత, ఆవిష్కరణలు, డిజిటల్ విప్లవం కారణంగా ఎన్నో కొత్త రంగాలు ఆవిర్భవిస్తున్నాయి. బయోఇన్ఫర్మాటిక్స్, జెనెటిక్స్, ఫోరెన్సిక్ సైన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఫిన్‌టెక్, డిజిటల్ మార్కెటింగ్, పబ్లిక్ పాలసీ, సైకాలజీ వంటి రంగాలు యువతకు విశాల అవకాశాలను అందిస్తున్నాయి. సంప్రదాయ కోర్సులే విజయానికి ఏకైక మార్గాలు కావు. విద్యార్థులు ఈ దశలో ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇది కేవలం కోర్సు ఎంచుకునే సమయం కాదు. జీవితానికి దిశ నిర్ణయించుకునే సమయం. అందుకే నిర్ణయం తీసుకునే ముందు మూడు ప్రశ్నలు తమను తాము అడగాలి.

నాకు నిజంగా నచ్చేది ఏమిటి?

నాకు బాగా వచ్చేది ఏమిటి?

నేను ఎలాంటి జీవితాన్ని కోరుకుంటున్నాను?

ఈ మూడు ప్రశ్నలకు నిజాయితీగా సమాధానాలు వెతికితేనే సరైన కెరీర్ ఎంపిక సాధ్యమవుతుంది. ఆసక్తి లేని రంగంలో కేవలం ఇతరుల ఒత్తిడితో అడుగుపెడితే విజయం సాధించడం కష్టమవుతుంది. అదే మనసుకు నచ్చిన రంగంలో కృషి చేస్తే అవకాశాలు స్వయంగా వస్తాయి. కెరీర్ అనేది కేవలం ఉద్యోగం కోసం చేసే ఎంపిక కాదు. అది వ్యక్తిత్వాన్ని, జీవనశైలిని, భవిష్యత్తును తీర్చిదిద్దే నిర్ణయం. అందుకే మార్కులు, ర్యాంకులు, సీట్లకే పరిమితం కాకుండా స్వీయ అవగాహనకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరమైతే కెరీర్ కౌన్సెలింగ్ సాయం తీసుకోవాలి. ఎందుకంటే సరైన నిర్ణయం తీసుకునే విద్యార్థికి కోర్సు మాత్రమే కాదు, జీవితానికే ఒక స్పష్టమైన దిశ లభిస్తుంది. డిగ్రీ కంటే దిశ ముఖ్యం. ఉద్యోగం కంటే అభిరుచి ముఖ్యం. ఇతరులు చెప్పిన దారి కంటే మనసు చూపిన మార్గమే శాశ్వత విజయానికి బాట వేస్తుంది.



**వ్యాసకర్త**
**చెరుకు జంగయ్య గౌడ్**
**సామాజిక కార్యకర్త**



## జర్నలిస్టుల సంఘం జిల్లా కోశాధికారిగా ఆకుల రఘుమయ్య



**మర్రిగూడ, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) నల్గొండ జిల్లా మహాసభలో కొత్త కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ ఆలీ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో, మర్రిగూడ మండల జర్నలిస్ట్ ఆకుల రఘుమయ్యను జిల్లా కోశాధికారిగా ఎన్నుకున్నారు.తన ఎన్నికపై స్పందించిన ఆకుల రఘుమయ్య మాట్లాడుతూ, "జర్నలిస్టుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తాను. నా ఎన్నికకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో విలేకర్లు రజాక్,వెంకటేష్, ఎం. శ్రీనివాస్, రఘు, బురుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నగూడెంలో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



**మహబూబాబాద్, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహకారంతో సుమారు 16 లక్షల రూపాయల వ్యయంతో ఈ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశాం" అని తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ కేంద్రం తోడ్పడుతుందని, వైద్య సిబ్బంది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఆయన సూచించారు.

# నేటి రాశి ఫలితాలు





**మేష రాశి**

అత్యంత శుభకరమైన రోజు పెట్టుబడును ఫలాలు ఇస్తాయి, ఆరోగ్యంగా ఉంటారు చాలా బలంగా ఆలోచిస్తారు, సంబంధాలను సామరస్యంగా బహిర్గతం చేయండి అదృష్ట రంగు ఎరుపు,సంఖ్య 5

**వృషభరాశి**

మీ స్వభావం ఈరోజు విజయాలను తెస్తుంది నాయకత్వం అవకాశాలు వస్తాయి. మంచి లాభాలు సాధ్యం.ఆరోగ్యంగా ఉంటారు. మనోభావాలను అవతల వ్యక్తిని ఆలోచించి వెల్లడి చేయాలి. అదృష్ట రంగు తెలుగు,సంఖ్య 5

**మిధున రాశి**

ఈరోజు మీకు గ్రహణబలం అధికంగా ఉంది. వృత్తిపరంగా విజయాలు మీ సొంతం. ఆర్థిక లాభాలు అధికంగా ఉన్నాయి. మీ మనోభావం సామరస్యంగా వ్యక్తం చేయండి.
అదృష్ట రంగు ఆకుపచ్చ అదృష్ట సంఖ్య 7

**కర్కాటక రాశి**

ఆలోచించి సంభాషిస్తే మీరు అనుకున్నది ఫలిస్తాయి. మీ కృషికి ఫలితం దక్కుతుంది. పెట్టుబడును లభిస్తాయి. ఆరోగ్యం పట్ల కొద్దిపాటి శ్రద్ధ అవసరం. అదృష్ట రంగు వెండి రంగు, అదృష్ట సంఖ్య 8

**సింహరాశి**

మీ మాట తీరు మీకు విజయాలు చేకూర్తాయి. అనుకోని లాభాలు సాధ్యం సమాజంలో గౌరవం దక్కుతుంది. అదృష్ట రంగు బంగారు రంగు,అదృష్ట సంఖ్య 9

కన్యా రాశి

దైవానుగ్రహంతో అద్భుతమైన ఫలితాలు పొందుతారు. వృత్తి ఉద్యోగాలలో విజయాలు సొంతం. ఆర్థికంగా లాభాలు ఉన్నాయి . మాట పట్టింపులకు దూరంగా ఉండండి. అదృష్ట రంగు ఆకుపచ్చ. అదృష్ట సంఖ్య 1.

తులారాశి

ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి. అత్యంత శుభకరమైన రోజు.కృషికి తగ్గ ఫలితం దక్కుతుంది. పెట్టుబడు లభిస్తాయి మీ మనోభావాలకు ప్రశంసలు దక్కుతాయి. అదృష్ట రంగు తెలుపు, సంఖ్య 2.

**వృశ్చిక రాశి**

ఈరోజు మీ స్వభావమే విజయాలు చేకూరుతాయి.
నాయకత్వపు లక్షణాలకు స్వాగతిస్తారు. అనుకోని లాభాలు చేకూరావచ్చు. మీ స్వభావాన్ని ఎక్కువగా వ్యక్తపరచవద్దు.
అదృష్ట రంగు మేరున్. సంఖ్య 3

ధనస్సు రాశి

సానుకూలమైన రోజు ఆచితూచి ప్రవర్తించండి. పనిలో స్థిరత్వం ఉంటుంది ఆర్థిక స్థిరమైన ఈరోజు ఆరోగ్యంగా ఉంటారు. ప్రియమైన వారితో ఆనందంగా గడుపుతారు.
అదృష్ట రంగు పసుపు. సంఖ్య4

**మకర రాశి**

మీ మాటకు విలువ ఇస్తారు. ధైర్యంగా చర్యలు తీసుకోండి. మీ కృషికి ఫలితం దక్కుతుంది. ఆర్థికంగా అనుకూలం. మంచి సంబంధాలను ప్రసంగా చేరువ చేసుకోవాలి.
అదృష్ట రంగు నీలం,
అదృష్ట సంఖ్య 5

**కుంభరాశి**


మీ స్వభావంతో మంచి విజయాలను తెస్తుంది. సమాజంలో గౌరవింపబడతారు.అనుకోని లాభాలు సాధ్యం ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ తప్పదు. సామరస్యంగా ప్రవర్తిస్తే అందరూ నీవాళ్లే. అదృష్ట రంగు నీలం,
అదృష్ట సంఖ్య 6

**మీన రాశి**

మీకు దైవానుగ్రహంతో అద్భుత ఫలితాలు పొందుతారు. ఆర్థిక లాభాలు అందిపుచ్చుకుంటారు. వృత్తిపరంగా విజయాలు మీ సొంతం కొద్దిపాటి ఆరోగ్య సమస్య. కలుపుగోలుతనంగా ప్రవర్తిస్తే అందరు నీవల్లే
అదృష్ట రంగు పసుపు, సంఖ్య 7

**శ్రీ కాలభైరవ ఉపవాసకులు**
**దక్క జంబులయ్య (స్వామి )**

**9491163914**



# తమిళనాడు రాజ్యసభ సీటు కాంగ్రెస్‌కే..

### పొత్తు ధర్మాన్ని పాటిస్తూ టీవీకే పార్టీ నిర్ణయం



**న్యూఢిల్లీ జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తమిళనాడులో రాజ్యసభకు జరగనున్న ఉప ఎన్నికలో అధికార టీవీకే పార్టీ ఆ సీటును కాంగ్రెస్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ టీవీకేతోపాటు కూటమిలోని పార్టీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రకటన చేశారు. తమిళనాడులో జరగబోయే రాజ్యసభ ఉప ఎన్నికలో టీవీకే కూటమి తరఫున సీటును కాంగ్రెస్‌కు కేటాయిస్తున్నామని విజయ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న రాజ్యసభ ఉప ఎన్నిక జరగనుంది.ఏఐఏడీఎంకే తరఫున రాజ్యసభలో ఎంపీగా కొనసాగిన సీవీ షణ్ముగం ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఆయన ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మైలాం అసెంబ్లీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. దీంతో షణ్ముగం తన పదవికి మే 7న రాజీనామా చేసి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఆయన రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఇప్పుడు ఉప ఎన్నిక జరగనుంది. ఇందులో ప్రధాన పోటీదారుగా కాంగ్రెస్ ఉండనుంది. అధికార టీవీకే కూటమి మద్దతు ఉండటంతో కాంగ్రెస్‌కు విజయావకాశాలున్నాయి. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా పీ తెన్మోళి కొనసాగనున్నారు. ప్రస్తుతం రాజ్యసభకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.ఆదివారం మినహా ఈ నెల 8 వరకు, ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన జూన్ 9 నుంచి ప్రారంభమవుతుంది. జూన్ 11 వరకు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది. అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. జూన్ 18న ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ జరగనుంది. తమిళనాడులో టీవీకేకు మద్దతు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి ఒక రాజ్యసభ సీటు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# బాలికను కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం..

### మృతదేహానికి నిప్పు



**భోపాల్ ,జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఒక బాలికను యువకుడు మభ్యపెట్టి కిడ్నాప్ చేశాడు. తన స్నేహితులతో కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బాలికను హత్య చేసి మృతదేహానికి నిప్పంటించి తగులబెట్టారు దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మే 28న 9వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. రాము గుర్జర్ అనే యువకుడు ఆమెను మభ్యపెట్టి తీసుకెళ్లినట్లు ఆమె కుటుంబానికి తెలిసింది. దీంతో ఆ బాలిక కోసం అన్నిచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో మౌ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కాగా, కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు రాము గుర్జర్‌ను అరెస్ట్ చేశారు. అతడ్ని ప్రశ్నించగా ఆ బాలికను ప్రలోభపెట్టి గ్వాలియర్‌కు తీసుకెళ్లినట్లు పోలీసులకు తెలిపాడు. గుప్తేశ్వర్ కొండపై ఉన్న నవగ్రహ ఆలయం సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో తన ఇద్దరు సహచరులైన అరుణ్ కుష్వా, గౌరవ్ కుష్వాలతో కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు చెప్పాడు.మరోవైపు ఎవరికైనా చెబుతుందన్న భయంతో మే 29న ఆ బాలికను హత్య చేసి మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు పోలీసులకు రాము తెలిపాడు. ఈ నేపథ్యంలో మిగతా నిందితులైన అరుణ్, గౌరవ్‌ను గ్వాలియర్‌లో అరెస్ట్ చేశారు. గుప్తేశ్వర్ కొండ ప్రాంతంలో కాలిన బాలిక అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం తర్వాత ఆమె కుటుంబానికి అప్పగించారు. అయితే ఈ సంఘటనపై బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహించారు. మంగళవారం రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ముగ్గురు నిందితులకు తక్షణమే మరణ శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సమగ్రంగా దర్యాప్తు జరిపి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని పోలీస్ అధికారి హామీ ఇచ్చారు. ఈ కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# యూపీని ఠారెత్తిస్తున్న ఎండలు..

### ఐదు రోజుల్లో 8,056 మరణాలు!



**లక్నో: జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉత్తరప్రదేశ్‌ను ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దీంతో తీవ్రమైన వడగాల్పుల వల్ల గత ఐదు రోజుల్లో 8,056 మంది మరణించినట్లు అంచనా. ఈ నేపథ్యంలో ఈ వేసవిలో దేశంలోనే అత్యంత ప్రాణాంతకమైన రాష్ట్రంగా యూపీ నిలిచింది. (ఖ్మితీ్రాత్మీఃవంష్ట) రెండవ అత్యంత ప్రభావిత రాష్ట్రమైన బీహార్‌లో 3,615, మధ్యప్రదేశ్‌లో 2,964, రాజస్థాన్‌లో 2,664 మరణాలు నమోదైనట్లు తెలుస్తున్నది.కాగా, ఐదు రోజుల పాటు కొనసాగిన తీవ్ర వడగాల్పుల వల్ల దేశంలో దాదాపు 30,000 మరణాలు సంభవించినట్లు ఒక అధ్యయనం ద్వారా అంచనా వేశారు. ఇందులో ఉత్తరప్రదేశ్‌లోనే 8,000కు పైగా మరణాలు సంభవించి ఉంటాయని భావిస్తున్నారు.మరోవైపు ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలు దేశ జనాభాలో 43 శాతాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. అయితే వేసవి వడగాలుల మరణాల్లో 60 శాతానికి పైగా ఈ ఐదు రాష్ట్రాల్లోనే నమోదు కావడం ఎండ తీవ్రత పరిస్థితులకు అద్దం పడుతున్నది.

# కర్ణాటకలో విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం..

### -తొలి క్యాబినెట్ భేటీలో సీఎం నిర్ణయం




**న్యూఢిల్లీ జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కర్ణాటకలో నూతన సీఎంగా డీకే శివకుమార్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. పదవీ ప్రమాణం అనంతరం ఆయన తన మంత్రివర్గంతో తొలిసారి సీఎం హోదాలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కర్ణాటకలో విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులు అందించాలని నిర్ణయించినట్లు సీఎం చెప్పారు.అంతేకాదు.. రైతులు వలస పోకుండా నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రివర్గ భేటీ అనంతరం నిర్ణయాల్ని సీఎం శివకుమార్ మీడియాకు వివరించారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి త్వరలోనే క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు. ఇదే సమయంలో ప్రైవేట్ ఉద్యోగాలకు సంబంధించి ప్రైవేట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ నిర్వహిస్తామన్నారు. అనధికారిక, అక్రమ కట్టడాలకు ఏ--ఖాటా డాక్యుమెంట్ జారీ చేస్తామని వివరించారు. ప్రజలు, యువత కర్ణాటక అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఏ ఒక్క నాయకుడు ఒంటరిగా మార్పును తీసుకురాలేమన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రతి రైతు, కార్మికుడు, మహిళ, విద్యార్థి, యువత అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజలంతా ఒక లక్ష్యంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అందరూ కలిసి పనిచేస్తే అధిగమించలేని సమస్య లేదన్నారు. బుధవారం సీఎంగా శివకుమార్‌తోపాటు 13 మంది మంత్రులుగా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే.

# పాలకుర్తి టోల్‌గేట్ యాజమాన్యంపై స్థానిక మీడియా ప్రతినిధులు ఫిర్యాదు



**పాలకుర్తి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాలకుర్తి మండలంలోని బసంతనగర్ హెచ్‌కే ఆర్ టోల్‌గేట్ యాజమాన్యం దురుసుగా ప్రవర్తించిందని ఆరోపిస్తూ స్థానిక మీడియా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కొంకటి రవీందర్, ప్రధాన కార్యదర్శి సీపెల్లి రాజేశం, గోదావరిఖని ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు కలిసి ఎస్సై నూతి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల టోల్‌చార్జీల పెంపుపై ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడానికి వెళ్లిన ఎన్టీవీ ప్రతినిధులపై టోల్‌గేట్ సిబ్బంది అనుమతి లేకుండా వీడియో, ఫోటోలు తీయవద్దంటూ ఆంక్షలు విధించి, నెట్టివేసి అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు.ఈ ఘటనను స్థానిక మీడియా తీవ్రంగా ఖండిస్తూ, పెద్దపల్లి డీసీపీ, ఏసీపీ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. టోల్‌గేట్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఎంపీ వంశీకృష్ణ తీవ్ర విమర్శలు



**పెద్దపల్లి, జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణకు న్యాయం చేస్తామని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యకరమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత ప్రాణత్యాగాలు చేసినప్పుడు, తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు వచ్చినప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణను అవమానించిన వారితో రాజకీయ పొత్తులు పెట్టుకుని ఇప్పుడు ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేసే రాజకీయ నాటకమని విమర్శించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చినప్పుడు స్పందించని పవన్ కళ్యాణ్ ఇప్పుడు రక్షకుడిలా మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.తెలంగాణ కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీ, తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ హక్కులను కాపాడేది కూడా కాంగ్రెస్ పార్టీయే అని వంశీకృష్ణ స్పష్టం చేశారు.పదవుల కోసం తెలంగాణ పేరును ఉపయోగించే వారిని ప్రజలు నమ్మరని, మాటలు కాదు చేతలే ముఖ్యం అని పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల కోసం ఎప్పటికీ ముందుండి పోరాడుతుందని కాంగ్రెస్ పార్టీ తరఫున వంశీకృష్ణ తెలిపారు.పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ప్రజలను మోసం చేసే రాజకీయ నాటకమని ఎంపీ వంశీకృష్ణ తీవ్రంగా ధ్వజమెత్తారు.

# బిజినెస్

# 1.60 లక్షల దిగువకు గోల్డ్

న్యూఢిల్లీ, జూన్ 3

బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడం, అమెరికా-ఇరాన్ సీజ్‌ఫైర్‌పై అనిశ్చితి నెలకొనడంతో ఈ ధరలు భారీగా తగ్గాయి.న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.1,850 లేదా 1.14 శాతం తగ్గి రూ.1,59,600కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.1,61,450గా ఉన్నది. కిలో వెండి రూ.1,500 తగ్గి రూ.2,69,500కి దిగొచ్చింది.



## ప్లాస్టో ప్రచారకర్తగా తాప్సీ




నాగ్‌పూర్ :
ప్లాస్టిక్ పైపులు, వాటర్ ట్యాంక్‌ల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒక్కటైన ప్లాస్టో..ప్రచారకర్తగా ప్రముఖ నటి తాప్సీ పన్నును నియమించుకున్నది. బాత్‌వేర్ ఉత్పత్తులకు తాప్సీ ప్రచారం చేయనున్నారు.కంపెనీ బ్రాండ్‌ను మరింత విస్తృతపర్చాలనే ఉద్దేశంతో తాప్సీని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్టు, తద్వారా మరింత మందికి చేరువకావడానికి వీలు పడనున్నదని కంపెనీ డైరెక్టర్ విశాల్ అగర్వాల్ తెలిపారు

## ఎన్ఎండీసీ ధరల పెంపు

న్యూఢిల్లీ, జూన్ 3




ఖనిజ ధరలను పెంచినట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. టన్ను ఖనిజ ధరను రూ.200 పెంచిన సంస్థ.. నాణ్యమైన టన్ను ఖనిజ ధరను రూ.150 సవరించింది. పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయని పేర్కొంది.అలాగే ప్రస్తుత త్రైమాసికంలో ఖనిజ ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం విశేషం. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో బైలా లంప్సం ఖనిజ టన్ను ధర రూ.5,700కి చేరుకోగా, నాణ్యమైన రకం రూ.4,850గా నమోదైంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్.


**- సెన్సెక్స్ 323 పాయింట్లు పతనం**



భారత స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 323 పాయింట్లు నష్టపోయి 74,326 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86 పాయింట్లు నష్టపోయి 23,396 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ నష్టాలతోనే ప్రారంభమైంది. సెన్సెక్స్ 74,300 పాయింట్లతో, 350కిపైగా పాయింట్ల నష్టంతో ప్రారంభమైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 100 పాయింట్ల నష్టంతో 23,400 వద్ద ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ నష్టాల బాటలోనే సాగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్? ఇండియా పాలసీ మీటింగ్ ఈ రోజు ప్రారంభమైంది. వారాంతం వరకు కొనసాగనుంది. దీంతో వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం వంటి అంశాల్లో ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనే అంశంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అమెరికా-- ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్‌పై నెగెటివ్ ప్రభావం చూపాయి. హార్ముజ్ జలసంధి పూర్తిగా ఓపెన్ కాకపోవడం, చమురు ధరల పెరుగుదల వంటివి కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్ర షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో టీసీఎస్ షేర్ దాదాపు 9 శాతం పతనమైంది. కోవిడ్ తర్వాత టీసీఎస్ షేర్లు ఈ స్థాయిలో పతనమవ్వడం ఇదే మొదటిసారి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఇండిగో, ఎస్బీఐ, ఐసీఐసీఐ షేర్లు లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ విపణిలో 4,461 డాలర్ల వద్ద కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.71గా ఉంది.


## కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం!?

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జరగబోయే ప్రతిష్టాత్మక ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027తో పాటు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, యాషెస్ సిరీస్ లాంటి బిజీ షెడ్యూల్ ఆస్ట్రేలియాకు ఉండటంతో, పనిభారం తగ్గించుకునేందుకు ఐపీఎల్‌కు బ్రేక్ ఇవ్వనున్నట్లు కమిన్స్ హింట్ ఇచ్చాడు. ఒకవేళ కమిన్స్ దూరమైతే, ఐపీఎల్ 2026లో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళన కలిగించే వార్త ఒకటి వెలుగులోకి వచ్చింది. జట్టు కెప్టెన్, స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ .. ఐపీఎల్ 2027 సీజన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అతడి స్వయంగా హింట్ ఇచ్చాడు. భవిష్యత్‌తో అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉందని.. దీంతో పనిభారం దృష్ట్యా.. ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు.కాగా ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు.. వచ్చే 18 నెలలు కీలకం కానుంది. ఈ గ్యాప్‌లో ఆస్ట్రేలియా జట్టు.. ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్, భారత్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, ఆ తర్వాత వన్డే ప్రపంచకప్ 2027 ఆడాల్సి ఉంది. ఒకవేళ పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిస్తే.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కూడా ఆడాల్సి రావచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్.. ఈ టోర్నీలు అన్నింట్లో ఆడాలని భావిస్తున్నాడు. దీంతో అవసరమైతే ఐపీఎల్ 2027కు దూరమయ్యేందుకు సిద్ధమయ్యాడు. "వచ్చే ఏడాది ఏదో ఒక దశలో నేను కచ్చితంగా ఒక టోర్నీకి దూరం కావాల్సి ఉంటుంది. అయితే అది దేశం తరఫున ఆడే టెస్ట్ మ్యాచ్‌లు లేదా వన్డే ప్రపంచకప్ మాత్రం కాదు. సమయం వచ్చినప్పుడు నేను నా ఐపీఎల్ ఫ్రాంచైజీ (సన్‌రైజర్స్ హైదరాబాద్)తో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుతానికైతే దీనిపై నేను ఇంతకంటే ఎక్కువ క్లారిటీ ఇవ్వలేను. ఎందుకంటే పరిస్థితులు మారవచ్చు లేదా గాయాలు కూడా కావచ్చు" అని పత్రికతో మాట్లాడుతూ కమిన్స్ వ్యాఖ్యానించాడు. కాగా ఐపీఎల్ 2026లో కొన్ని మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సారథిగా ఇషాన్ కిషన్ వ్యవహరించాడు. కమిన్స్ వచ్చాక అతడే సారథ్య పగ్గాలు చేపట్టాడు. ఈ సీజన్‌లో సన్ రైజర్స్ టాప్-4లో నిలిచింది. అయితే ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడి.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. వచ్చే సీజన్‌లో కమిన్స్ అందుబాటులో లేకపోతే.. ఇషాన్ కిషన్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.




## లాహోర్‌లో ఆసీస్ చేతిలో పాకిస్తాన్ చిత్తు

పాకిస్తాన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలిచి సిరీస్ సమం చేశాయి. రావల్పిండిలో పాకిస్తాన్ విజయం సాధించగా.. లాహోర్‌లో పాకిస్తాన్‌ను ఆసీస్ చిత్తు చిత్తుగా ఓడించింది. ఆస్ట్రేలియా బౌలర్లు చెలరేగడంతో ఒకానొక దశలో 120 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని భావించారు. కానీ షాదాబ్ ఖాన్, ఆరాఫత్ మిన్హాస్ రాణించడంతో 190 పరుగులు చేసింది. నాలుగు వికెట్లు తీసుకున్ననాథన్ ఎలీస్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.సొంతగడ్డపైనే పాకిస్తాన్‌ను ఆస్ట్రేలియా చిత్తుచిత్తుగా ఓడించింది. పాకిస్తాన్ వేదికగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో పాకిస్తాన్ విజయం సాధించగా, రెండో వన్డేలో ఆస్ట్రేలియా గెలిచింది. మొదటి వన్డేలో ఆస్ట్రేలియాను 200 పరుగులకే ఆలౌట్ చేయగా.. రెండో వన్డేలో పాకిస్తాన్‌ను 190 పరుగులకే ఆలౌట్ చేసింది. సొంతగడ్డపై ఇంత దారుణంగా ఓడిపోవడంతో పాక్‌పై ఆ దేశ నెటిజన్లే ట్రోల్స్ చేస్తున్నారు. లాహోర్‌లోని గఢాఫీ స్టేడియం వేదికగా జరిగిన రెండో వన్డేలో టాస్ గెలిచిన పాకిస్తాన్ కెప్టెన్ షాహీన్ షా అఫ్రిది బౌలింగ్ ఎంచుకుని, ఆసీస్‌ను బ్యాటింగ్‌కి ఆహ్వానించాడు. మొదటి బంతికే షాహీన్ అఫ్రిది అలెక్స్ క్యారీని గోల్డెన్ డక్‌గా పెవిలియన్‌కు పంపాడు. మరో ఓపెనర్ మాథ్యూ షార్ట్ కూడా 15 పరుగులకే అవుటవ్వగా.. మొదటి వన్డేలో డకౌట్ అయిన మార్నస్ లబుషేన్, ఈ మ్యాచ్‌లో 5 పరుగులకే వికెట్ కోల్పోయాడు. దాంతో ఆస్ట్రేలియా 51 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. జట్టు కష్ట సమయంలో ఉండటంతో కెప్టెన్ జోస్ ఇంగ్లిస్, కామెరూన్ గ్రీన్ ఆదుకున్నారు. ఈ ఇద్దరూ హాఫ్ సెంచరీలు చేయడంతో ఆసీస్ గట్టున పడింది. ఇంగ్లిస్ 51, గ్రీన్ 53 పరుగులు చేసి అవుటయ్యారు. మ్యాట్ రెన్షా 43, ఒలీవర్ పీక్ 31 చేయడంతో ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. సొంతగడ్డపై ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్తాన్‌కు ఆస్ట్రేలియా బౌలర్లు షాక్ ఇచ్చారు. ఆసీస్ జట్టులో క్యారీ గోల్డెన్ డకౌట్ కాగా.. పాక్‌లో మాజ్ సదాఖత్ తొలి బంతికే అవుటయ్యాడు. షాహిబ్‌జాదా ఫర్హాన్ రెండో ఓవర్‌లో, బాబర్ ఆజామ్ ఐదో ఓవర్, సల్మాన్ అలీ అఘా 8వ ఓవర్‌లో అవుటవ్వడంతో పాకిస్తాన్ 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అబ్దుల్ సమ్మద్, ఘాజీ ఘోరీ కూడా వెంటవెంటనే అవుటవ్వడంతో 78 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. 120 పరుగుల లోపే ఆలౌట్ అవుతారని అనుకున్న సమయంలో షాదాబ్ ఖాన్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. షాదాబ్‌కి తోడు ఆరాఫత్ మిన్హాస్ కూడా నిలబడటంతో పాక్ ఘోర ఓటమిని తప్పించుకుంది. షాదాబ్ 104 బంతుల్లో 71, అరాఫత్ 43 బంతుల్లో 33 పరుగులు చేసి అవుటవ్వడంతో పాకిస్తాన్ కథ ముగిసింది. 44 ఓవర్లకే 190 పరుగులకు ఆలౌట్ అయింది. దాంతో ఆసీస్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. నాలుగు వికెట్లు తీసుకున్న నాథన్ ఎలీస్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మూడు వన్డేల సిరీస్‌లో చెరొక మ్యాచ్ గెలిచి సిరీస్ సమం చేశాయి.



# స్పోర్ట్స్

## వైభవ్ సూర్యవంశీ రెమ్యునరేషన్ డబుల్




ఇండియా క్రికెట్ లో సరికొత్త సెన్సేషన్ గా మారిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ క్రేజ్ ఇప్పుడు అమాంతం పెరిగిపోయింది. ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడి 237.30 ఊహించని స్ట్రైక్ రేట్ తో 776 రన్స్ బాదిన ఈ బిహార్ బ్యాటర్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నాడు. టోర్నమెంట్ లో ఆరెంజ్ క్యాప్ తో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. ఈ సంచలన పర్ఫార్మెన్స్ తర్వాత మైదానం వెలుపల కూడా అతడి డిమాండ్ డబుల్ అయింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ తో రూ. 1.10 కోట్ల యాన్యువల్ కాంట్రాక్ట్ లో ఉన్న వైభవ్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల రూపంలో అంతకు మించి సంపాదిస్తున్నాడు. ఆటోమొబైల్, మీడియా వర్గాల సమాచారం ప్రకారం ఐపీఎల్ స్టార్ట్ అవ్వడానికి ముందు వైభవ్ ఒక్కో బ్రాండ్ డీల్ కోసం దాదాపు రూ. 1 కోటి వరకు ఛార్జ్ చేసేవాడు. అయితే సీజన్ ముగిసేసరికి అతడి ఎండార్స్‌మెంట్ ఫీజ్ ఏకంగా డబుల్ అయింది. ప్రస్తుతం అతడు ఒక్కో కొత్త డీల్ కోసం రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్ ఒకరు ఎన్డీటీవీ కి స్పష్టం చేశాడు. ఇప్పటికే కాంప్లాన్, రెడ్ బుల్ లాంటి పెద్ద బ్రాండ్లకు అంబాసిడర్ గా మారిన వైభవ్ తో కొలాబరేట్ అవ్వడానికి మరికొన్ని కంపెనీలు లైన్ లో ఉన్నాయి. చిన్న ఏజ్ లోనే వస్తున్న ఈ సడన్ పాపులారిటీ, బిజినెస్ డీల్స్ ను వైభవ్ సూర్యవంశీ పేరెంట్స్ జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తున్నారు. అతడి ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ కూడా ఈ విషయంలో ఈ వండర్ కిడ్ మేనేజ్‌మెంట్ టీమ్ కు పూర్తి సపోర్ట్ అందిస్తోంది. ఐపీఎల్ లో సృష్టించిన రికార్డుల కారణంగానే బ్రాండ్లు అతడి వెనుక పరుగులు పెడుతున్నాయని ఎక్స్ పర్ట్స్ చెబుతున్నారు. ఒకవేళ భవిష్యత్తులో వైభవ్ ఐపీఎల్ మెగా వేలంలోకి వస్తే ఏకంగా రూ. 30 కోట్ల వరకు బిడ్ దక్కించుకునే ఛాన్స్ ఉందని కొందరు అంచనా వేస్తున్నారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సాధించిన అచీవ్‌మెంట్స్ చూసి మాజీ క్రికెటర్లు, లెజెండ్స్ అతడిని సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్ లాంటి గ్రేట్ ప్లేయర్లతో పోలుస్తున్నారు. టాలెంట్ పరంగా అతడి హిట్టింగ్ కెపాసిటీ అద్భుతంగా ఉన్నప్పటికీ, కెరీర్ ఇప్పుడిప్పుడే స్టార్ట్ అవుతుండటంతో వచ్చే అవకాశాలను జాగ్రత్తగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐపీఎల్ తెచ్చిన ఈ స్టార్ డమ్ తో ఇండియా క్రికెట్ లో అతడి బ్రాండ్ వాల్యూ సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.